# చెరువుల అభివృద్ధికి చర్యలేవి?

**సీఎస్సార్‌తో చెరువుల పునరుద్ధరణ!**

- మొదటి 12 చెరువుల పునరుజ్జీవనం ఏమైంది?
- బడ్జెట్ విషయంలో ప్రభుత్వ స్పందన కరువు
- ఏజెన్సీలతో హైడ్రా సంప్రదింపులు

ఈదుల కుంటలో సర్వే నిర్వహిస్తున్న హైడ్రా బృందం

సిటీబ్యూరో, జనవరి 2(నమస్తే తెలంగాణ): కూల్చివేతలతో పాటు చెరువుల పునరుజ్జీవనంపై హైడ్రా సీరియస్‌గా దృష్టి పెట్టిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల తెలిపారు. ఇందులో భాగంగా మొదట పన్నెండు చెరువులను అభివృద్ధి చేసేందుకు రూపొందించిన డీపీఆర్‌లను ప్రభుత్వానికి అందజేశామని చెప్పారు. అయితే నిధుల పరంగా కోట్ల రూపాయలు అవసమవుతుండటంతో హైడ్రా ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి పెద్దగా స్పందన రాలేదని తెలుస్తోంది. తాము డీపీఆర్‌లు ఇచ్చి నెలరోజులైనా ఇప్పటివరకు చెరువుల పునరుజ్జీవన ప్రతిపాదనలపై రేవంత్ రెడ్డి సర్కార్ స్పందించకపోవడంతో ప్రత్యామ్నాయం వైపు హైడ్రా దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో తమకు పై నుంచే ప్రత్యామ్నాయం వెతుక్కోవాలని, బడ్జెట్ అంటే కష్టమని చెప్పినట్లు హైడ్రా అధికారి ఒకరు తెలిపారు. పునరుజ్జీవనానికి ఎంపిక చేసుకున్న పన్నెండు చెరువుల్లో ఒక్కో చెరువు సుందరీకరణకు చెరువు విస్తీర్ణాన్ని బట్టి సుమారుగా ఐదుకోట్ల రూపాయలకు పైగానే బడ్జెట్ అవసరమవుతుందని హైడ్రా అంచనా వేసింది. ఆ దిశగా డీపీఆర్‌లు కూడా తయారుచేసి ప్రభుత్వానికి ఇచ్చింది. కూల్చివేతల తర్వాత హైడ్రా మార్క్ కేవలం కూల్చివేతలే కాదు.. చెరువుల పునరుజ్జీవనం తమ లక్ష్యం అని ప్రజలకు సమాచారమిచ్చేందుకు కమిషనర్ రంగనాథ్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, ఇప్పటివరకు ప్రతిచోటా కూల్చివేతలే తప్ప ఎక్కడా ఒక్క చెరువు కూడా పునరుజ్జీవనం వైపు అడుగుపడకపోవడంతో హైడ్రా పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నదని హైడ్రా బృందం ఇటీవల జరిగిన అంతర్గత సమావేశంలో చర్చించింది. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఏజెన్సీలతో మాట్లాడేందుకు హైడ్రా అధికారులు ప్లాన్ చేసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎస్సార్ కింద పలు చెరువులను అభివృద్ధి చేశారు. మళ్లీ అదే తరహాలో చెరువుల అభివృద్ధిలో భాగస్వామ్యం కోరుతూ పలు సంస్థలను హైడ్రా సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. రియల్ ఎస్టేట్ రంగం కాకుండా మిగతా రంగాలకు చెందిన సంస్థలను ఇందులో భాగస్వామ్యం చేయాలంటూ ప్రభుత్వ పెద్దలే కమిషనర్‌కు సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చెరువుల వద్దనున్న కొన్ని ఆక్రమణలు తొలగించి ప్రస్తుతం ఉన్న ఖాళీ స్థలాన్ని తమ స్వాధీనం చేసుకున్న హైడ్రా అక్కడ పనులు మొదలు పెట్టడానికి కావలసిన ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

### ఈదుల కుంటలో హైడ్రా సర్వే

సిటీబ్యూరో, జనవరి 2(నమస్తే తెలంగాణ): శేరి లింగంపల్లి మండలం ఖానామెట్‌లో ఉన్న ఈదుల కుంటలో హైడ్రా బృందం గురువారం పర్యటించింది. సర్వే ఆఫ్ ఇండియా టోపో మ్యాప్ ప్రకారం, సర్వే చేయించి హద్దులను నిర్ధారించే పనిని మొదలుపెట్టారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌కు చెందిన హై రిసొల్యూషన్ మ్యాప్‌లు, ఖానామెట్ – కూకట్‌పల్లి విలేజ్ మ్యాప్‌ల ఆధారంగా చెరువు ఆనవాళ్లను హైడ్రా ఇది వరకే గుర్తించినట్లు కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఈ సర్వే బృందంలో హైడ్రా, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు పాల్గొన్నారు.

### మొదట నాలుగు చెరువులే..!

హైడ్రా ఏర్పడిన తర్వాత జరిగిన కూల్చివేతల్లో సుమారుగా 210 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని హైడ్రా స్వాధీనం చేసుకుంది. ఓఆర్ఆర్ లోపల చెరువుల ఆక్రమణలు తొలగించి అక్కడ సుందరీకరణకు చేపట్టవలసిన చర్యలపై కొన్నిరోజుల క్రితం రంగనాథ్ బెంగళూరుకు చెందిన ఆనంద్ మల్లిగవాడ్‌ను హైదరాబాద్ పిలిపించి ఆయనతో చర్చించారు. ఈ మేరకు పునరుజ్జీవనం దిశగా మొత్తం పన్నెండు చెరువులను ఎంపిక చేసుకున్న హైడ్రా ఆయా చెరువుల అభివృద్ధిపై డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసి సర్కార్‌కు ఇచ్చింది. ఈ విషయమై ప్రభుత్వ పెద్దలను సంప్రదించిన కమిషనర్ బృందానికి వారు చేసిన సూచనల మేరకు సీఎస్సార్ కింద నాలుగు చెరువులను తొలి దశలో డెవలప్ చేయబోతున్నారు. అంబర్‌పేట బతుకమ్మ కుంట, తార్నాకలోని ఎర్రకుంట, భూజాగూడ తొర్రోని కుంట, మాదాపూర్‌లోని తమ్మిడి కుంటలను అభివృద్ధి చేయడానికి హైడ్రా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే అంబర్‌పేట బతుకమ్మకుంటలో స్వాధీనం చేసుకున్న స్థలంలో చెత్తనంతా తొలగించి చదును చేశారు. ఆ రకంగా మిగతా చెరువులపై కూడా ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు.

## క్రీడాకారుడికి అభినందన



జాతీయ స్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీల్లో స్వీలర్ మెడల్ సాధించిన క్రీడాకారుడు చైతన్యపురి స్థానికుడైన తోట సంకీర్తన్ యాదవ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు తోట మహేశ్ యాదవ్ పాల్గొన్నారు.

– ఎల్బీనగర్, జనవరి 2;

కూకట్‌పల్లి రామాలయంలో ఆలయ ద్వారానికి తొడుగుల కోసం 30 కేజీల వెండిని అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, యలమంచలి రాధాకృష్ణ, ఝాన్సీలక్ష్మీ దంపతులు

## రామాలయానికి వెండి బిస్కెట్ల వితరణ అభినందనీయం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 2: కూకట్‌పల్లి శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలోని అమ్మవారి ఆలయ ద్వారం తలుపుల కోసం 30 కేజీల వెండి బిస్కెట్లను వితరణగా అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి రామాయలంలో దాతలు యలమంచలి రాధాకృష్ణ, ఝాన్సీలక్ష్మీ దంపతులు 30 కేజీల వెండి బిస్కెట్లను ఎమ్మెల్యే కృష్ణారావు చేతుల మీదుగా రామాలయానికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 400 ఏండ్ల చరిత్ర కలిగిన రామాలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించినట్టు తెలిపారు. రామాలయంలో శ్రీలక్ష్మీదేవి అమ్మవారి ప్రధాన ద్వారానికి, తలుపులకు వెండి తొడుగుల కోసం 30 కేజీల వెండిని అందించడం సంతోషకరమన్నారు. యలమంచలి రాధాకృష్ణ, ఝాన్సీలక్ష్మీ దంపతులు రాముడి అనుగ్రహంతో సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్లు రంగారావు, పగుడాల బాబురావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నాయినేని చిన్న తులసీరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రాజ్యాధికారం దిశగా హక్కులు సాధిద్దాం

అభివాదం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు

రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ, జనవరి 2: బీసీలకు భిక్షం వొద్దు, రాజ్యంగబద్ధంగా రావాల్సిన హక్కులను కల్పించాలని, బీసీల ఉద్యమాలు రాజ్యాధికారం దిశగా పయనించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో గురువారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. 19వ విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలు ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల నియామకాల్లో 50 శాతం పోస్టులను బీసీ అధికారులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ ఉద్యోగులకు తక్షణమే పదోన్నతులను కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో 73 వేల మంది ఉద్యోగులు ఉన్నారని, అందులో 50 వేల మంది బీసీ ఉద్యోగులే ఉన్నారని, అయినప్పటికీ బీసీ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఏ వర్గానికి లేని విధంగా బీసీ ఉద్యోగులకు క్రిమిలేయర్ విధానాన్ని రుద్దడం హేమమైన చర్యగా ఆరోపించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శులు కె.కుమారస్వామి, ముత్యం వెంకన్న గౌడ్, రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్, అశోక్ కుమార్, డాక్టర్ చంద్రుడు, పి.యాదగిరి, శ్రీనివాస్, రాజేందర్, సదానందం, శివాజీ, విజయ కుమార్, రవీందర్, శ్రీకాంత్, అశోక్, వీరన్న, నిఖిల్, తెలంగాణ బీసీ విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## దేవాదాయ కమిషనర్‌ను కలిసిన టీఎన్జీవో నేతలు

సిటీబ్యూరో, జనవరి 2(నమస్తే తెలంగాణ): టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రధాన దేవాలయాల ఉద్యోగ జేఏసీ నేతలు గురువారం దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలను వినతిపత్రం ద్వారా కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వివిధ దేవాలయాలలో పని చేస్తున్న ఉద్యోగులలో అనార్యోగ సమస్యలున్న వారిని, భార్యా భర్తలు ఇద్దరు ఉద్యోగం చేస్తున్న వారిని, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ వంటి చిన్న కేడర్‌లలో పని చేస్తూ బదిలీ అయిన వారిని తిరిగి వారి మాతృ సంస్థలకు బదిలీ చేయాలని కోరారు. పేపర్ ప్రమోషన్ పొంది బెనిఫిట్స్ పొందలేకపోతున్న ఉద్యోగులకు వెంటనే సదరు బెనిఫిట్స్ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరగా, ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, జనరల్ సెక్రటరీ ముజీబ్, ప్రధాన దేవాలయాల జేఏసీ చైర్మన్ రమేశ్ బాబు, ఏఈఓ కృష్ణ, నవీన్ కుమార్, దాసోజు నరేశ్, దయానంద్ పాల్గొన్నారు.

## ఉద్యోగులు మరింతగా కష్టపడి మెరుగైన సేవలందించాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, జనవరి 2(నమస్తే తెలంగాణ): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ హైదరాబాద్ జిల్లా నూతన క్యాలెండర్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆవిష్కరించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యేలా ఉద్యోగులు కృషి చేస్తున్నారని, ఈ సందర్భంగా కమిషనర్ అభినందించారు. ఉద్యోగులంతా మరింతగా కష్టపడి ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా చూడాలని కమిషనర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణ యాదవ్, సెక్రటరీ ఎంఏ ఖాదర్, నర్సింగ్ రావు, డాక్టర్ కుమార్, డాక్టర్ నాగరాజ్ పాల్గొన్నారు.

## గుండె సమస్యలున్న వృద్ధురాలికి అధునాతన చికిత్స

వెల్లడించిన కేర్ ఆస్పత్రి వైద్యులు

బంజారాహిల్స్, జనవరి 2: గుండె సమస్యలతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూ అత్యంత ప్రాణాపాయ స్థితిలో ఉన్న వృద్ధురాలికి బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి వైద్యులు అధునాతన వైద్య చికిత్సను అందించి ప్రాణాలు కాపాడాడు. బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్, కార్డియాలజీ విభాగాధిపతి డా. వి.సూర్యప్రకాష్ వివరాలను వెల్లడించారు. పలుమార్లు గుండెపోటుకు గురైన నగరవాసి ఓ మహిళ(68) ఇటీవల కేర్ ఆస్పత్రిలో చేర్చారు. ఆమె గుండె కేవలం 25 శాతం రక్తాన్ని మాత్రమే సరఫరా చేస్తుండటంతో పాటు అరిథ్రియా, వెంట్రిక్యులర్ టాకికార్డియా, వెంట్రిక్యులర్ ఫిబ్రిల్లేషన్ ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించిన వైద్యులు చికిత్సను ప్రారంభించారు. ఇంట్రా అయోర్టిక్ బెలూన్ పంప్ పరికరంలో రోగిని ఉంచి స్టెలేట్ గ్యాంగ్లియన్ బ్లాక్ వైద్య చికిత్సను అందజేశారు. కార్డియో వెర్షన్, అధునాతన ఫార్మాకో థెరపీ అందించి, స్టేట్ ఆఫ్ ది హార్ట్ కార్డియాక్ సింక్రోనైజేషన్ థెరపీ డిఫిబ్రిల్లేర్ (సీఆర్‌టీడీ) అమర్చడం ద్వారా ఆమె ప్రాణాలు కాపాడగలిగామని డా. సూర్యప్రకాష్ తెలిపారు. అన్ని విభాగాలకు చెందిన వైద్య నిపుణులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరెండెంట్ డా. అజిత్ ంగ్, జోనల్ సీవోవో బిజు నాయర్, డా. ఎస్.రాహుల్ అగర్వాల్, డా. టీవీఎస్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి నుమాయిష్

- మాజీ ప్రధాని సంతాపంలో భాగంగా రెండు రోజుల ఆలస్యం
- 25 లక్షల పై చిలుకు సందర్శకులు సందర్శించే అవకాశాలు

అబిడ్స్, జనవరి 2: నగర ప్రజలను అలరించేందుకు గాను నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) శుక్రవారం ప్రారంభం కానుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో సంతాప దినాలుగా ప్రభుత్వం ప్రకటించడం, దీంతో జనవరి ఒకటో తేదీన ప్రారంభం కావాల్సిన నుమాయిష్ రెండు రోజులు ఆలస్యంగా ప్రారంభిస్తున్నారు. శుక్రవారం ప్రారంభోత్సవానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రదర్శనను ప్రారంభించనున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి డి.మోహన్, కోశాధికారి డాక్టర్ బి.ప్రభాశంకర్‌లు తెలిపారు. ఎగ్జిబిషన్ మైదానంలో స్టాళ్ల నిర్మాణ పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. ప్రతి సంవత్సరం జనవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు 46 రోజుల పాటు ఎగ్జిబిషన్ మైదానంలో నుమాయిష్ నిర్వహిస్తారు. ఈ సంవత్సరం 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు గాను స్టాళ్ల కేటాయింపు పూర్తి కాగా, నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. నుమాయిష్‌ను సందర్శించేందుకు గాను నగర నలుమూలల నుంచే కాకుండా పలు జిల్లాల నుంచి లక్షలాది మంది తరలి వస్తారు. గత సంవత్సరం దాదాపు 25 లక్షలకు పైచిలుకు సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శించగా, ఈ సంవత్సరం మరింతగా సందర్శకులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎగ్జిబిషన్ సందర్శనకు వచ్చే సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి డి.మోహన్, కోశాధికారి డాక్టర్ బి.ప్రభాశంకర్‌లు తెలిపారు. ఎగ్జిబిషన్ సందర్భంగా సీసీ కెమెరాలు, వాలంటీర్లు, మెటల్ డిటెక్టర్లు, ప్రత్యేక సెక్యూర్టీ ద్వారా భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ఎగ్జిబిషన్‌లో స్టాళ్ల ఏర్పాటు దృశ్యాలు

### 84వ వసంతంలోకి ప్రదర్శన..

నుమాయిష్ 84వ వసంతంలోకి అడుగు పెడుతుండటంతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఎగ్జిబిషన్‌ను శుక్రవారం సాయంత్రం ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రితో పాటు ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లతో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులు ఈ ప్రారంభోత్సవానికి విచ్చేయనున్నారు.

## స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు



కాచిగూడ, జనవరి 2: తెలంగాణలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లుకల్పించాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. గురువారం కాచిగూడలో సమాజిక న్యాయవేదిక ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వకుళాభరణం కృష్ణమోహన్‌రావు హాజరై మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం పెంచడానికి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎన్నికలకు వెళ్లాని డిమాండ్ చేశారు. బీసీలకు ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో స్థానిక సంస్థల ఎన్నికలకు 42 శాతం వరకు రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చాడని, ఆ హామిని అమలు చేయాలని సూచించారు. తెలంగాణలో స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీసీల రిజర్వేషన్ల పెంపునకు తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రపాల్, డి.కుమారస్వామి, మోక్షజ్ఞ, రవి, సమ్మయ్య, ప్రేమ్‌లాల్, నవీన్ కౌశల్, జితేందర్, శ్రీరామ్, చక్రధర్, రవికాంత్, రఘురాం గౌడ్, ప్రభు, వినయ్ పాల్గొన్నారు.

## బీడీ కార్మికుల కోసం ప్రత్యేక చట్టం చేయాలి



మూసివేయడం వల్ల వారు రోడ్డున పడుతారన్నారు. సంబంధిత మంత్రిత్వ శాఖ సమీక్షలు నిర్వహించి కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

ఖైరతాబాద్, జనవరి 2: దేశంలోని బీడీ కార్మికుల కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారత కార్యదర్శి సురేంద్రన్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో సుమారు నాలుగు కోట్ల మంది బీడీ కార్మికులు బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పరిశ్రమను రక్షించి బీడీ కార్మికులకు ఉపాధి దెబ్బ తినకుండా చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, పదేండ్లు పూర్తయిన వారికి పెన్షన్ ఇవ్వాలన్నారు. ఆరోగ్యానికి హానికరం అన్న పేరుతో బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయం చూపకుండా

## రేపటి నుంచి పీసీ సర్కార్ మ్యాజిక్ షో

**సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో 19వ తేదీ వరకు..**

**నగరానికి తిరిగి ఏడేండ్ల తరువాత పీసీ సర్కార్ మ్యాజిక్ షో..**

**వివరాలను వెల్లడించిన పీసీ సర్కాస్ (జూనియర్)**



సమావేశంలో మాట్లాడుతున్న పీసీ సర్కార్ (జూనియర్)

మారేడ్‌పల్లి, జనవరి 2: ప్రపంచ ప్రఖ్యాత మెజీషియన్ పీసీ సర్కార్ (జూనియర్) తన మెగా మ్యాజిక్ షో 'ఇంద్రజాల్' ద్వారా మంత్రముగ్ధులను చేసే ప్రదర్శన ఇస్తున్నారు. సర్కార్, మ్యాజిక్ విడదీయరానివి, మ్యాజిక్ అనేది పీసీ సర్కార్ రక్తంలోనే ఉన్నది. ఒకసారి గాఢమైన నిద్రలో ఉన్నప్పుడు నేను మ్యాజిక్ శ్వాసగా పీల్చుకుంటాను. మేల్కొని ఉన్నప్పుడు నేను మ్యాజిక్ చేస్తాను. అంతలా మా జీవితాల్లో మ్యాజిక్ పెనవేసుకుని ఉండిపోయిందని పీసీ సర్కార్ జూనియర్ అంటున్నారు. మ్యాజిక్ ప్రపంచానికి సర్కార్ చేసిన గొప్ప సహకారం ఇండియన్ మ్యాజిక్, అతని గొప్ప కళతో నాయకత్వంతో ఇది అంతర్జాతీయ ఆకర్షణగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రతిష్టాత్మక అవార్డులను గెలుచుకున్న సర్కార్లు ఇండియన్ మ్యాజిక్‌కు గొప్ప రాయబారులుగా ఉన్నారు. ఈ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం ద్వారా, భారతదేశపు లియోనార్డో-డా-విన్సీ అని పిలువబడే సీపీ సర్కార్ (యంగ్) తనంతట తానుగా ఒక లెజెండ్. అతని కుమారుడు పీసీ సర్కార్ (జూనియర్) కుటుంబంలో అతి పిన్న వయస్కుడైన మాంత్రికుడు, చిత్రకారుడు. ఈ సారి పీసీ సర్కార్ (జూ.) ఏడేండ్ల తర్వాత నగరంలోని సికింద్రాబాద్ హరిహర కళా భవన్‌లో ప్రదర్శన ఇస్తున్నారు. జనవరి 4వ తేదీ నుంచి 19వ తేదీ వరకు (శని, ఆదివారం) సాయంత్రం 4, 7 గంటలకు, అదే విధంగా సంక్రాంతి పండుగ సందర్భంగా 13, 14వ తేదీల్లో ప్రత్యేక షోలను నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 85230 38257, ఆన్‌లైన్ బుకింగ్ WWW.insider,in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చునని తెలిపారు.

### హెచ్‌సీయూలో ఎంబీఏ కోర్సుకు దరఖాస్తులు

కొండాపూర్, జనవరి 2: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంబీఏ కోర్సు 2025 – 27వ విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ యాజమాన్యం గురువారం తెలిపింది. ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ఆసక్తి గల విద్యార్థులు జనవరి 15లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఐఐఎం కోల్‌కత్తా ఆధ్వర్యంలో నిర్వహించిని క్యాట్ –2024లో ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. ఇతర వివరాల కొరకు http://acad.uohyd.ac.in, http://www.uohyd.ac.in వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చన్నారు.



## చదవడం, రాయడంపై దృష్టి సారించాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, జనవరి 2(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులు చదవడం, రాయడం లాంటి బేసిక్ అంశాల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చెప్పారు. అమీర్‌పేటలోని డీకే రోడ్డులో గల ప్రభుత్వ ప్రౌఢమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. మూడు, ఐదో తరగతి విద్యార్థుల ప్రతిభ అంశాలను కలెక్టర్ పరిశీలించారు. బడిబాట ద్వారా పిల్లల హాజరు శాతం పెంచాలని సూచించారు. నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గణితం, ఆంగ్లంపై పట్టు ఉండేలా ప్రత్యేక కృషి చేయాలని చెప్పారు. అనంతరం, కలెక్టర్ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పాఠశాలను ప్రత్యేక అధికారుల బృందం ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తనకు రిపోర్టు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా విద్యా శాఖాధికారి డి.రోహిణి, తహసీల్దార్ పద్మ సుందరి, డిప్యూటీ ఈఓ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్య నియంత్రణ మండలి వాల్ పోస్టర్ ఆవిష్కరణ

సిటీబ్యూరో, జనవరి 2(నమస్తే తెలంగాణ): తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వాల్ పోస్టర్‌ను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం ఆవిష్కరించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చడం కాలుష్యానికి ప్రధాన కారణమని, నిబంధనలు పాటించాలని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.సురేశ్, కె.సాయి దివ్య, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.